ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు జిల్లా వార్తలు
3
శుక్రవారం 7 నవంబరు 2025

నిత్యం కరువుతో తల్లడిల్లుతున్న పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే 'ఆదోని జిల్లా' ఏర్పాటే ఏకైక పరిష్కారం అని ఇక్కడి ప్రజలు నినదిస్తున్నారు. జిల్లా కావాలంటూ ఆదోని జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ప్రజలు రోడ్డెక్కారు. ప్రజలకు రాజకీయ మద్దతు లేకపోవడంతో ఆదోని జిల్లా డిమాండ్ కలగానే మిగిలిపోయిందని ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. 2022లో ఉమ్మడి కర్నూలు జిల్లా విభజన జరిగినప్పుడే ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం, రెవెన్యూ శాఖ జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుపై స్పష్టత ఇచ్చాయి. ఆదోని మండలంలోని పెద్దహరివాణాన్ని మండలంగా ఏర్పాటు చేయనున్నారు.





ఆదోని పట్టణం ఏరియల్ వ్యూ

జిల్లా ఆశలు అడియాశలేనా?

- రెండు మండలాలుగా ఆదోని
- కొత్తగా పెద్దహరివాణం మండలం
- స్పష్టత ఇచ్చిన మంత్రివర్గ ఉప సంఘం
- ఏ మండలంలో ఏ గ్రామాలు?
- ఢిల్లీలో పావులు కదుపుతున్న ఎమ్మెల్యే

కర్నూలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదోని కేంద్రంగా కొత్తగా జిల్లా ఏర్పాటు చేయాలని, ఆదోని నియోజకవర్గాన్ని నాలుగు మండలాలుగా విభజించి ప్రజలకు పాలన సౌలభ్యం కల్పించాలని ఇక్కడి ప్రజలు ప్రధాన డిమాండ్. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఇదే అంశంపై అసెంబ్లీలో గళమెత్తారు. ఆదోని జిల్లా ఏర్పాటు లేనట్లేనని ఉపసంఘం స్పష్టత ఇచ్చింది. కొత్తగా పెద్దహరివాణం మండలం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఎమ్మెల్యే పార్థసారథి ఢిల్లీ కేంద్రంగా పావులు కదుపుతున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక..

వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన జిల్లాల పునర్విభజన సమయంలో ఆదోని కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా వినిపించారు. ఆదోని జిల్లా సాధన సమితి పేరిట ఆందోళనలు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల కేంద్రంగానే కొత్త జిల్లాలు నాడు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడంతో ఆదోని జిల్లా ఆశలు అడియాశలయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాలు, డివిజన్లు పునర్ వ్యవస్థీకరణపై సీఎం చంద్రబాబు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. జిల్లాలు, డివిజన్లు, మండలాల ఏర్పాటుపై వచ్చిన ప్రతిపాదనలు, వినతులను మంత్రివర్గం స్వీకరించింది. ఆదోని జిల్లా సహా ఆదోని నియోజకవర్గం మొత్తం ఒకే మండలంగా ఉంది. ఆదోని, ఆదోని అర్బన్, పెద్దహరివాణం, పెద్దతుంబళం నాలుగు మండలాలుగా విభజించాలని ఎమ్మెల్యే పార్థసారథి మంత్రివర్గ ఉప సంఘానికి వినతిపత్రం ఇవ్వడంతో పాటుగా అసెంబ్లీలో గళమెత్తారు. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాలను కలుపుతూ ఆదోని కేంద్రంగా జిల్లా చేయాలనే డిమాండ్‌ను మంత్రివర్గం ఉపసంఘం పరిగణలోకి తీసుకోలేదని తెలుస్తున్నది.

2022లో జిల్లాల పునర్విభజన..

1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత 1956 అక్టోబరు 31వరకు కర్నూలు రాజధానిగా కొనసాగింది. 1953నుంచి 12అసెంబ్లీ నియోజకవర్గాలు, 53 మండలాలతో అతిపెద్ద జిల్లాల్లో ఒకటిగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో 14 నియోజకవర్గాలుగా విస్తరించింది. 2022లో జిల్లాల పునర్విభజన కారణంగా కర్నూలు, కోడూమూడు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, నియోజ కవర్గాలు పూర్తిగా, పాణ్యం నియోజకవర్గంలోని రెండు మండలాలు కలిపి 26 మండలాలతో 'కర్నూలు జిల్లా' మిగిలింది. నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం, బనగానపల్లె, నందికొట్కూరు, డోన్ నియోజకవర్గాలు, పాణ్యం నియోజకవర్గంలోని పాణ్యం, గడివేముల మండలాలు కలిపి 27మండలాలతో కొత్తగా నంద్యాల జిల్లా ఆవిర్భవించింది. ఆ సమయంలో ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది.

ఆదోని జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో..

ఆదోని జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు గురువారం ఆందోళనకు సై అన్నాయి. పెద్దహరివాణంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు ఆది నారాయణరెడ్డి, మరికొందరిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రజా సంఘాలు తప్ప ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజకీయ నాయకులు డిమాండ్ చేయకపోవడంతోనే ఆదోని జిల్లా ఏర్పాటు డిమాండ్ ఎండమావిగా మారిందనే ఆరోపణలు లేకపోలేదు. ఎమ్మెల్యే పార్థసారథి తాజాగా ఢిల్లీ కేంద్రంగా ఆదోని జిల్లా ఏర్పాటుకు పావులు కదుపుతున్నారు.



నాలుగు కాదు.. రెండు మండలాలే

ఆదోని నియోజకవర్గంలో 46 రెవెన్యూ గ్రామాలు, 40 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2011 గణాంకాల ప్రకారం 1.15 లక్షల జనాభా ఉంటే, ప్రస్తుతం 1.50 లక్షలకు పైగా చేరింది. నాలుగు మండలాల ఏర్పాటు ఆవశ్యకతపై పక్కా వివరాలు, అంకెలతో పాటు నివేదికలు ఇచ్చారు. ఈ ప్రతిపాదనను పట్టించుకోని మంత్రివర్గ ఉపసంఘం కొత్తగా పెద్దహరివాణం మండలం ఏర్పాటుకు స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తుంది. ఆదోని నియోజకవర్గం ఆదోని, పెద్దహరివాణం రెండు మండలాలు అవుతాయి. ఏ మండలంలో ఏ గ్రామాలు చేరుస్తున్నారో స్పష్టత లేదు. నాలుగు మండలాలు కాకపోయినా ఆదోని, పెద్దహరివాణం, పెద్దతుంబళం మూడు మండలాలుగా విభజించాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో జి. నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 9 గంటలకు 1వ స్థాయి సంఘ సమావేశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, శాసనసభ్యులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం, అనుబంధ శాఖలు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, మత్స్యశాఖ, దేవదాయ శాఖలపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

పక్కాగా ఈక్రాప్

- లోపాలు తలెత్తితే బాధ్యత మీదే
- పంటలపై తెగుళ్లను నివారించండి
- క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి
- రైతులకు అండగా ఉండండి: కలెక్టర్ సిరి



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీలో రైతులు సాగు చేస్తున్న ప్రతి పంట వివరాలు ఈక్రాప్‌లో నమోదు చేయాలని, ఎలాంటి లోపాలు జరగకూడదని కలెక్టర్ ఏ. సిరి వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం టెలి కాన్ఫరెన్స్‌లో పై విభాగాలకు చెందిన అధికారులతో పంటలకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. భారీ వర్షాల కారణంగా పంటల్లో వ్యాపిస్తున్న తెగుళ్ల, క్రిమికీటకాలను నివారించి రైతులను నష్టాల నుంచి గట్టెక్కించాలని ఆదేశించారు. వ్యవ సాయ, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులకు అండగా ఉండాలని సూచించారు. ఉల్లి పంట వివరాలను సర్వే నెంబర్ వారీగా రైతుల ప్రకారం వివరాలు ఇవ్వాలన్నారు. సెప్టెంబరు మొదటి వారం నుంచి ఇప్పటి దాకా ప్రతి వారం ఎంత మేరకు క్రాప్ బుకింగ్ చేశారనే వివరాలను సర్టిపై చేసి తనకు అందించాలని కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారి రాజావర్దన్ రెడ్డిని ఆదేశించారు. మిరప పంటలో ముడత వ్యాధి వ్యాపిస్తోందని, తక్షణమే గ్రామాల్లో పర్యటించి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పత్తి రైతుల వివరాలు సీఎం యాప్‌లో, కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసేందుకు రైతులకు రైతు సేవా కేంద్రాల సిబ్బంది అండగా ఉండాలని అన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యుల్లో ఉల్లాస్ వెలుగులు

- వయోజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- విద్యా శాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం
- పర్యవేక్షకులుగా వివిధ శాఖల అధికారులు

4

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి
టీజీవీ కళాక్షేత్రం

గజ వాహనంపై ప్రహ్లాదరాయలు

భక్తులతో కిటకిటలాడిన మంత్రాలయం

మంత్రాలయం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజత గజ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం పాడ్యమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో ప్రహ్లాదరాయలను ఊరేగించారు.



రజత గజవాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

భక్తుల కోలాహలం

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తుల మఠం కోలాహలంగా మారింది. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం, తుంగభద్ర కారిడార్ భక్తులతో కిటకిటలాడాయి.

12న జిల్లాకు సీఎం రాక?

- ఇళ్ల ప్రారంభానికి వచ్చే అవకాశం
- ఆదోని మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన అధికారులు



బసాపురంలో పర్యటిస్తున్న అధికారులు

ఆదోని రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు జిల్లాకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ముందస్తుగా అధికారులకు సమాచారం రావడంతో వివిధ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. హౌసింగ్ స్కీం ద్వారా పేదలు నిర్మించుకున్న ఇళ్లను ప్రారంభించడానికి ఈనెల 12న ఆదోనికి సీఎం రావచ్చని అధికారులు టెలి కాన్ఫరెన్స్ హాలులో చెప్పడంతో సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చిరంజీవి, తహసీల్దార్ రమేశ్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరేకల్లు రామకృష్ణ గురువారం బసాపురం, ఢణాపురం గ్రామాల్లో పర్యటించారు. మండలంలో ప్రభుత్వం సహాయంతో ఎంతమంది 100శాతం ఇళ్లు నిర్మించుకున్నారనే సమాచారాన్ని అధికారులు సేకరిస్తున్నారు. గురువారం రాత్రి ముఖ్యమంత్రి పర్యటన ఉందా? లేదా? అని తెలుస్తుందని అధికారులు తెలిపారు.

పేదలకు వైద్య సేవలందించడమే లక్ష్యం

- జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు
- ఆస్పత్రిలో అఖిల భారత సర్వీసు అధికారుల బృందం పర్యటన



అఖిల భారత సర్వీస్ అధికారులతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేద రోగులకు వైద్య సేవలందించడమే లక్ష్యమని జీజీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాకు శిక్షణ కోసం వచ్చిన అఖిల భారత సర్వీసుల అధికారుల బృందం గురువారం ఉదయం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పర్యటించారు. శిక్షణ పొందుతున్న 15 మంది అధికారుల బృందం ఆస్పత్రిలోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్, ఓపీ, ఐసీ కౌంటర్లలో సేవలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లభిస్తున్న కుటుంబ సంక్షేమ పథకాలు, వైద్య పరికరాలు, సదుపాయాల గురించి సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. విపరీతంగా రోగుల రద్దీ ఉన్న న్యూడయోగ్నస్టిక్ బ్లాక్, ఓపీ కౌంటర్లను పరిశీలించి రోగులతో మాట్లాడారు. అనంతరం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును కలిశారు. ఆసుపత్రి కార్యకలాపాలు, వైద్యసేవలు, ఆరోగ్య పథకాలపై బృందానికి సూపరింటెండెంట్ వివరించారు. ప్రతి రోజు 3వేల నుంచి 3,500 మంది రోగులు వస్తుంటారని తెలిపారు. ఈ సందర్భంగా భుజం నొప్పికి శస్త్రచికిత్స చేసుకున్న హర్యానాకు చెందిన ట్రైనీ ఐఏఎస్ డిపెంధర్ మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిని మరువలేనని సూపరింటెండెంట్ చికిత్స చేయడంతోనే కోలుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత సర్వీసుల అధికారులు, హాస్పిటల్ ఆర్ఎంవో డాక్టర్ టీసీహెచ్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కదులుతున్న అవినీతి డొంక



తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

- రెండో రోజూ సోదాలు
- ఏసీబీ వలయంలో ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- అధికారుల బ్యాంకు ఖాతాలపై ఆరా

ఆళ్లగడ్డ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తవ్వేకొద్ది అవినీతి డొంక కదులుతుంది. గురువారం రెండో రోజు కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో ఈతనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్యాలయానికి బయట గొళ్లం పెట్టి మరి పాత రికార్డులను తీసి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన భూములు, స్థలాల రిజిస్టర్లు, స్టాంప్ అమ్మిన రికార్డులతో పాటు కార్యాలయంలో పనిచేసే అధికారుల బ్యాంకు ఖాతాలను సైతం తీసి మరి ఆరా తీస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే అవినీతి అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మరిన్ని రోజులు సోదాలు కొనసాగుతాయన్నారు. రూ.100 విలువ గల నాన్ జ్యుడిషియల్ స్టాంపులు 103వరకు రికార్డుల్లో నమోదు చేయకపోవడాన్ని గుర్తించామన్నారు. సీనియర్ అసిస్టెంట్ అనిల్ డాక్యుమెంట్ రైటర్లతో గూగుల్ పే ద్వారా కొంత మొత్తాన్ని వేయించుకొన్నట్లు వెలుగులోకి వచ్చిందని, దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు. చుక్కల భూములు, ప్రభుత్వ భూములు సైతం తప్పుడు సర్వేనంబర్‌లతో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తనిఖీలో గుర్తించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరింత లోతుగా దర్యాప్తు చేపడుతామని ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు టెక్నీషియన్లకు ఏసీబీ నోటీసులు

- విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

శ్రీశైలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టికెట్ల స్కాంలో ఏసీబీ అధికారులు ఇద్దరు టెక్నీషియన్లకు నోటీసులు ఇచ్చారు. శుక్రవారం విచారణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. శ్రీశైల దేవస్థానం ఆదాయానికి గండి కొట్టి టికెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని దారి మళ్లించిన కేసులో ఇద్దరు టెక్నీషియన్లను విచారించేందుకు కర్నూలు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు. నోటీసులకు సకాలంలో స్పందించి వివరణ ఇవ్వకపోతే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. 2018 ఆగస్టు నెలలో బయటపడిన నిధుల మళ్లింపు కేసులో ప్రధాన నిందితులుగా భావిస్తున్న మరికొంత మందిని కూడా త్వరలో విచారించే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

10 నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఈనెల 10వ తేదీ నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-1) పరీక్షలు నిర్వహించాలని డీఈవో శామ్యూల్‌పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి 19వ తేదీవరకు 8, 9, 10 తరగతులకు ఉదయం 9.15గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, 6, 7 తరగతులకు మధ్యాహ్నం 1.15గంటల నుంచి సాయంత్రం 4.15గంటల వరకు పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఒకటి నుంచి 5వ తరగతులకు 11 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు పెట్టాలని వివరించారు. ఈవిషయాన్ని మండల విద్యాశాఖ అధికారులు, తమ పరిధిలో ఉన్న అన్ని యాజమాన్య పాఠశాలలకు పరీక్షల టైం టేబుల్ చేరేలా చర్యలు తీసుకోవాలని డీఈవో ఆదేశించారు.

వసతి గృహాల్లో మెనూ పాటించాలి

- జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాధిక

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మెనూ పాటించాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాధిక అన్నారు. గురువారం స్థానిక జిల్లా కార్యాలయంలో సహాయ సంక్షేమ అధికారులు, వసతిగృహ సం క్షేమ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మెనూ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి హాస్టల్‌లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. హాస్టల్స్‌లో ఏదైనా సంఘటన జరిగితే, అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కలెక్టర్, అధికారులు వసతిగృహాలను తరచూ తనిఖీలు చేస్తారని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో సహాయ సంక్షేమ అధికారులు మద్దిలేటి, బాబు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు సుంకన్న, వెంకటరెడ్డి, బెన్నమ్మ, సులోచన, డి.ముదాసిర్ పాల్గొన్నారు.

డిజిటల్ బోధనను వినియోగించుకోండి

- ఆర్జేడీ శామ్యూల్



కాల్వబుగ్గ ఏపీఆర్ గురుకుల పాఠశాలలో ట్యాబ్‌లను పరిశీలిస్తున్న ఆర్జేడీ శామ్యూల్

ఓర్వకల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డిజిటల్ బోధనను సద్వినియోగించుకోవాలని ఆర్జేడీ శామ్యూల్ అన్నారు. గురువారం మండలంలోని కస్తూర్బా, మోడల్ స్కూల్, ఏపీఆర్ గురుకుల పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ డిజిటల్ బోధన కోసం ఒక్కొక్క పాఠశాలకు ట్యాబ్‌లను అందజేశామన్నారు. ఇప్పటికే డిజిటల్ విద్యపై విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు వీడియో పాఠాలను విన్న తర్వాత వాటిపై కొన్నిప్రశ్నలు ఉంటాయని, వాటిని జవాబు రాయడం ద్వారా స్వయం మూల్యాంకనం చేసుకోవచ్చన్నారు. ప్రత్యేక ప్లాట్‌ఫాం సాయంతో ఇన్ఫోసిస్ బృందం ట్యాబ్‌ల వినియోగాన్ని పర్యవేక్షిస్తుందన్నారు. నెలవారి నివేదికను ప్రభుత్వానికి అందిస్తుందన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇన్ఫో సిస్ సంస్థ ప్రశంసా పత్రాలు ఇవ్వడంతో పాటు అప్రెంటిషిప్ అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్‌పాల్, ఎంఈవో ఓంకార్ యాదవ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌కు సిద్ధంగా ఉండాలి

వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ



సమావేశానికి హాజరైన కలెక్టర్ డాక్టర్ సిరి, జేసీ నూరుల్ ఖమర్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2025కు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. గురువారం ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ రాష్ట్ర సెక్రటేరియట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌నిర్వహించారు. కర్నూలు కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏ.సిరి పాణ్యం నియోజకవర్గ ఈఆర్‌వో, జేసీ నూరుల్ ఖమర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటు హక్కును అర్హులైన వారందరూ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని వివేక్ సూచించారు. కలెక్టర్ సిరి మాట్లాడుతూ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2025కు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఈఆర్వోలను ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటరుగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నా రు. వీసీలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఎన్‌డీసీ అనురాధ, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్ పాల్గొన్నారు.

రాఘవేంద్ర మఠానికి రూ. 2 లక్షలు విరాళం

మంత్రాలయం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి కార్వారుకు చెందిన శ్రీనివాస్ అనే భక్తుడు రూ.2లక్షల విరాళం ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న శ్రీనివాస్ శుక్రవారం సంపూర్ణ అన్నదానసేవకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ఆళ్లగడ్డ టీచర్‌ను మెచ్చుకొన్న మంత్రి లోకేశ్



కర్రసాము ద్వారా గణితం నేర్పుతున్న టీచర్

ఆళ్లగడ్డ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామం మోడల్ ఉన్నత పాఠశాలలోని గణిత ఉపాధ్యాయుడు వెంకటచంద్రుడును మంత్రి నారా లోకేష్ గురువారం అభినందించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఆటపాటల్లో మమేకం చేస్తూ, స్నేహపూర్వక విద్యాబోధన ద్వారా లెక్కలు బోధిస్తున్నందుకు సోషల్ మీడియా వేదికగా 'గుడ్ వర్క్.. కీపిటప్' అని మెచ్చుకొన్నారు. గ్రౌండ్‌లోనూ గణితం చెబుతున్న మీ ప్రతిభకు అభినందనలు అన్నారు. కోలాటం, చెక్కభజన, కర్రసాము నేర్పుతూనే వివిధ పరీక్షలకు సిద్ధం చేస్తున్న మీ కృషి స్ఫూర్తిదాయకం అని కొనియాడారు.

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు



సినీనటి రవళి

శ్రీశైలం నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను మాజీ మంత్రి రోజా, ప్రముఖ సినీ నటి రవళి దర్శించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా గురువారం వీరు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రాకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనాలతో తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

8న భక్త కనకదాసు జయంతి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీ భక్త కనకదాసు జయంతి ఉత్సవం ఈ నెల 8వ తేదీన కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కురువ కులస్థులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజలు భారీ ఎత్తున పాల్గొని జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఆహార శుద్ధి యూనిట్లకు సహకారం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆహారశుద్ధి యూనిట్లకు పీఎంఎస్‌ఎంఈ కింద 35 శాతం రాయితీ పొందవచ్చని డీఆర్‌డీఏ రమణారెడ్డి తెలిపారు. గురువారం టీటీడీసీలో డీఆర్డీఏ-సెర్ప్ ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు ఔత్సాహికులకు వ్యవసాయ, వ్యవసాయేతర, ఆహార ఉత్పత్తులపై అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మారుతి నరసమ్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని లీలా వెంకట శేషాద్రి అన్నారు. గురువారం స్థానిక బి.క్యాంపులోని డిగ్రీ కాలేజ్ ఫర్ మెన్‌లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కళాశాలలలో వివిధ న్యాయ సేవల పథకాల గురించి నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, లీగల్ సర్వీసెస్ సభ్యుడు శ్రీనివాస్, అధ్యాపకులు డా.ఫకృన్నిసాబేగం, వింధ్యావాసిని దేవి, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డా. మౌలానా అజాద్ 137వ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక పాతనగరంలోని మైనార్టీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా స్థాయిలో మౌలానా ఆజాద్ జీవిత చరిత్ర, జాతీయ సమైక్యతకు, దేశ విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి అనే అంశంపై పాఠశాల, ఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయి విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబీహా పర్వీన్, కన్వీనర్ డా.బి. షంషుద్దీన్ తెలిపారు. ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఈ నెల 11న జరిగే జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేస్తున్నట్లు వివరించారు.

15 వరకు బిర్సా ముండా జయంతి వారోత్సవాలు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా జయంతి ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సాధికారిత అధికారి బి. సురేష్ తెలిపారు. గురువారం కర్నూలు నగరంలోని రెండు పాఠశాలలను పరిశీలించారు.

నిరక్షరాస్యుల్లో ఉల్లాస్ వెలుగులు

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ముఖ్యంగా మహిళల్లో అక్షరాస్యత చాలా తక్కువగా ఉండటంతో మహిళా విద్యాభివృద్ధి దృష్టి పెట్టింది. ఇందుకు విద్యా శాఖ మంత్రి విశేష కృషి చేసి ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. పొదుపు మహిళలు, ఉపాధి కూలీ పనులకు వెళ్లే వారు, చదువు మధ్యలో మానేసిన వారికి విద్యను అందించేందుకు సిద్ధపడింది. పొదుపు సంఘాల్లోని అక్షరాస్యులైన మహిళలకు శిక్షణ ఇచ్చి వారితో విద్యా బోధన చేయిస్తోంది. 2029 నాటికి వంద శాతం అక్షరాస్యతే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

- వయోజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- విద్యా శాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం
- పొదుపు సంఘాల్లో మహిళలకు శిక్షణ
- పాఠ్య సామగ్రి అందజేత
- పర్యవేక్షకులుగా వివిధ శాఖల అధికారులు



చాగలమర్రిలో అక్షరాభ్యాసం చేస్తున్న మహిళలు

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వయోజన విద్యకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం నిరక్షరాస్యుల్లో ఉల్లాస్ కార్యక్రమంతో వెలుగులు నింపుతోంది. మహిళలకు చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవీలు నిర్వహించేలా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే పేరుతో వయోజన విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమానికి రెండో విడత శ్రీకారం చుట్టింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను, ఉపాధి హామీ పనులు చేసే కూలీలను మధ్యలోనే బడిమానేసి అక్షరాలు మర్చిపోయిన వారిని గ్రామస్థాయిలో గుర్తించారు. ఇందుకు కార్యాచరణ రూపకల్పన చేసి క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నారు.



వాచకాలు పంపిణీ చేస్తున్న వయోజన అధికారి ఆదినరసింహ

స్వచ్ఛందంగా చదువు చెప్పడానికి..

స్వచ్ఛందంగా చదువు చెప్పడానికి పొదుపు సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి వారికి ఇప్పటికే మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. పాఠ్యాంశ సామగ్రిని అందజేశారు. ప్రతి గ్రామలో పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులైన 10మంది సభ్యులకు ఒక వలంటీర్ అక్షరాలతో పాటు సంతకాలు చేయడం నేర్పిస్తారు. వర్ణమాల, లెక్కలు కట్టడం, బ్యాంకు లావాదేవీల నిర్వహణ వంటి పలు అంశాలతో పాటు డిజిటల్ చెల్లింపులు, మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు తదితర అక్షరాస్యతపైన పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారు. గ్రామాల్లో వెసులుబాటు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు అందరికి ఆమోద యోగ్యమైన ప్రదేశాల్లో ప్రత్యేక తరగతులకు సిద్ధం చేశారు. డీఆర్‌డీఏ, మెప్మా, ఉపాధిహామీ పథకాలలో నిరక్షరాస్యులైన వారిని గుర్తించారు.

2029నాటికి శత శాతం అక్షరాస్యత..

రాష్ట్రంలో అక్షరాస్యత పెంపునకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 2029 నాటికి శతశాతం అక్షరాస్యత లక్ష్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలోని 28 మండలాల్లో 1.6 లక్షల మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారు. వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి పది మందికి ఒక స్వచ్ఛంద మహిళా వలంటీర్‌ను ఎంపిక చేశారు. వీరికి రెండు విడతలుగా శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించాల్సి ఉంది. జిల్లాలో 10 వేల వయోజన విద్యా కేంద్రాలు, 10 వేల మంది వలంటీర్లను ఏర్పాటు చేశారు. వలంటీర్లకు ఉల్లాస్ వాచకాలను కూడా పంపిణీ చేశారు.

వలంటీర్లతో బోధన చేయించేలా...

డీఆర్‌డీఏ పరిధిలోని పొదుపులక్ష్మి గ్రూపుల్లో 50వేల మంది చదువురాని వారిని, ఉపాధి హామీ పనులు చేసుకునే వారిలో 25వేల మంది మహిళలను, మున్సిపాల్టీ పరిధిలోని మెప్మాలో 25 వేల మందిని నిరక్షరాస్యులుగా గుర్తించారు. వీరందరికి వలంటీర్లతో బోధన చేయించేలా ప్రణాళిక చేశారు. ఇందులో 75వేల మంది మహిళలున్నారు. వీరందరికీ 2026 మార్చి చివరి వరకు స్వచ్ఛంద వలంటీర్లు బోధన చేసి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా చూస్తారు. అనంతరం వారికి ఎన్‌ఐవోఎస్ పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారు. ఉల్లాస్ ప్రక్రియ విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. వయోజన విద్య సజావుగా సాగేలా వీరు పర్యవేక్షించనున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



మహిళలు డిజిటల్ మోసాలకు గురి కాకుండా అవగాహన కల్పిస్తున్నాం. తెలుగు భాష, గణితం నేర్పడంతో పాటు దైనందిన వినియోగానికి సంబంధించిన నైపుణ్యాలను పెంచుతున్నాం.

● నాగమ్మ, ఏపీఎం, వెలుగు, చాగలమర్రి

సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం

జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. ఉల్లాస్ ద్వారా 10,683 మంది వలంటీర్లను నియమించి నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పిస్తున్నాం. పర్యవేక్షణకు సూపర్‌వైజర్లను నియమించాం. ● విజయభాస్కర్‌రెడ్డి, ఏపీవో, వయోజన విద్య, నంద్యాల

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి టీజీవీ కళాక్షేత్రం



సమావేశంలో ప్రసంగిస్తున్న తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి

- మూడోసారి దక్కిన గౌరవం
- చైర్మన్ చింతపట్ల వెంకటాచారి
- అలరించిన కర్నూలు ఉత్సవ్-2025 ఆరో రోజే కార్యక్రమాలు

కర్నూలు కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి టీజీవీ కళాక్షేత్రం వరుసగా మూడోసారి స్థానం పొందిందని ఆ సంస్థ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి ప్రకటించారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో రాష్ట్ర అవతరణ వారోత్సవాల్లో భాగంగా, ఏపీ నాటక అకాడమీ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారం రోజుల కర్నూలు ఉత్సవ్-2025 ఆరో రోజు గురువారం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి తొలుత రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కార్యాలయంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రకటించిన గోల్డ్ మెడల్‌ను, ప్రశంసాపత్రాలను టీజీ వెంకటేశ్‌కు, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యకు అందజేసి వారిని సత్కరించారు. అనంతరం కళాక్షేత్రంలోని కార్యక్రమాలకు విచ్చేసి కళాక్షేత్రంలో తెలుగు తల్లి, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్వాతంత్ర్య సమరయోధులు, సీనియర్ రంగస్థల కళాకారుల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. గురువారం కొనసాగిన ఏకాంకిక పౌరాణిక పద్య నాటక పోటీల కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేసి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ ఈ ఏడాది మే 28న దివంగత సినీ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ 101వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రాల్లోని 101 పాటలకు నృత్య ప్రదర్శనలు ఇచ్చి, తొలి రికార్డు నమోదు చేసుకోగా, ఈ ఏడాది ఆగస్టు 15న నిర్విరామంగా 24 గంటలు, 80 మంది కళాకారులతో నృత్య ప్రదర్శనలిచ్చి రెండో రికార్డును టీజీవీ కళాక్షేత్రం నమోదు చేసుకొందని గుర్తు చేశారు. అలాగే రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి వారం రోజులు కార్యక్రమాలు నిర్వహించి మూడోసారి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిందని అన్నా రు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ జిల్లాలో అంతరించి పోతున్న కళలకు జీవం పోసే దిశగా టీజీవీ కళాక్షేత్రం కృషి చేస్తోందని తెలిపారు.

అలరించిన నాటక పోటీలు...ఆకట్టుకున్న అష్టావధానం, సంగీత విభావరి

కర్నూలు ఉత్సవ్-2025లో భాగంగా ఆరో రోజు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిన ఏకాంకిక పౌరాణిక పద్య నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను కనువిందు చేశాయి. రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, శ్రీకృష్ణరాయబారం, బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర వంటి నాటకాల్లోని పద్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. సాయంత్రం 7 గంటల నుంచి ప్రారంభమైన గంగుల నాగరాజు అష్టావధానం అలరించింది. అనంతరం నాట్యాచార్యుడు ఆంజనేయులు బృందం శాస్త్రీయ నృత్య రూపకాలు, ఇబ్రహీం, హబీబ్, సుధారాణి, సుజాత, ఖాజావలి, రేఖ, రేలారేలా గోపాల్, శ్రీనివాసులు, బీవీ ప్రకాశ్, రాణి తదితరులు సంగీత విభావరి, జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, వాల్మీకి రాముడు, కేవీ రమణ, పీపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'అమ్మా'నవీయం

- నందికొట్కూరు ఆసుపత్రిలో నవజాత శిశువును వదిలి వెళ్లిన వైనం
- సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ.. తల్లి గుర్తింపు
- బిడ్డను తీసుకోవడానికి నిరాకరించిన తల్లి
- ఐసీడీఎస్, పోలీసుల ఆధ్వర్యంలో నంద్యాలకు శిశువు తరలింపు



ఆసుపత్రిలో శిశువును తీసుకుంటున్న ఐసీడీఎస్, పోలీసు అధికారులు

నందికొట్కూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమ్మా.. ఎందుకిలా చేశావు? ఆ శిశువు మాటలొచ్చి ఉంటే అడిగేదేమో?.. అడిగినా సమాధానం కూడా లేదు ఆ తల్లి వద్ద. బిడ్డను తీసుకోవడానికి ఆ తల్లి నిరాకరించింది. ఈ ఘటన నందికొట్కూరు పట్టణంలో గురువారం జరిగింది. వివరాలివి.. నందికొట్కూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి పట్టణంలో నివాసం ఉంటోంది. గురువారం తెల్లవారుఝామున పట్టణంలోని ఇంటి వద్ద ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఉదయం 11.50 గంటలకు యువతి సోదరి శిశువును నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చింది. అక్కడ వార్డులో శిశువును పడుకోబెట్టి, తాగునీరు తెచ్చుకుంటామని చెప్పి బయటకు వెళ్లిపోయింది. ఎంతసేపటికీ ఆమె రాకపోవడంతో పక్క బెడ్డులో ఉన్న వారు ఆసుపత్రి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో శిశువును ఇంక్యుబేటర్‌లోకి తీసుకెళ్లి వైద్యం అందించారు. అలాగే రక్త పరీక్షలు చేశారు. తక్కువ బరువు, వెన్నెముకలో సమస్య ఉందని వైద్యులు గుర్తించారు. ఐసీడీఎస్ అధికారులకు ఆ శిశువును అప్పగించి మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ జకి అక్మానీ తెలిపారు.

ఆ యువతికి మూడో కాన్పు?

నవజాత శిశువును ఆసుపత్రిలో వదిలి వెళ్లడంతో అధికారులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఓ మహిళ ఆ శిశువును వదిలిన దృశ్యాలు రికార్డయ్యాయి. దీంతో ఆసుపత్రి అధికారులు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు పోలీసులను వెంటపెట్టుకొని పట్టణంలోని కాలనీకి వెళ్లారు. దీంతో శిశువును వదిలివెళ్లిన మహిళ గురించి ఆరా తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ప్రసవం అయిన మహిళ సోదరి గురించి తెలుసుకున్నారు. ఆ మహిళకు ఇది మూడో కాన్పు అని సమాచారం. ఆమెకు పెళ్లి కానట్లు తెలిసింది. మొదటి ఇద్దరి శిశువులను కూడా డబ్బులకు విక్రయించినట్లు తెలుస్తోంది. గురువారం శిశువుకు జన్మనిచ్చింది. ఈ శిశువు గురించి స్థానికులు అడగ్గా.. శిశువు చనిపోయిందని, అంత్యక్రియలు చేయడానికి తన సోదరి వెళ్లిందని ఆ యువతి చెప్పినట్లు సమాచారం. తమ వివరాలు బయటపెడితే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని ఆ యువతి ఐసీడీఎస్ అధికారులను బెదిరించినట్లు తెలిసింది.

బిడ్డను తీసుకోవడానికి నిరాకరించిన తల్లి

మరోసారి ఇలా జరగకూడదని కాలనీ వాసులు ఆసుపత్రికి వచ్చి ఫిర్యాదు చేయడంతో కుటుంబ సభ్యులను, ప్రసవం అయిన మహిళను ఆసుపత్రి వైద్యులు పిలిపించి ఎంఎల్‌సీ చేసినట్లు తెలిసింది. ఐసీడీఎస్ సీడీపీవో మంగవల్లి తన సిబ్బందితో అక్కడికి వెళ్లి శిశువు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బిడ్డను తీసుకోవడానికి తల్లి నిరాకరించింది. దీంతో ఆ వైద్యుల వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

స్వానిధితో అండ

- చిరు వ్యాపారులకు రుణ సాయం పెంపు
- మరో ఐదేళ్ల పాటు పొడిగింపు
- చిరు వ్యాపారుల్లో హర్షం



నంద్యాల టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పీఎం స్వానిధి పథకం(లోక కల్యాణ్)తో చిరు వ్యాపారులకు ఆర్థికంగా అండగా నిలుస్తోంది. 2030 వరకు కొనసాగించడంతో పాటు రుణ సాయాన్ని కూడా పెంచాలని కేంద్రం నిర్ణయించింది. చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకాన్ని 2020లో ప్రారంభించారు. ఈ ఏడాదితో ముగియనుండడంతో దీన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగించి కేంద్రం చిరు వ్యాపారులకు చేయూతనందించింది. ప్రస్తుతం నంద్యాలలో లోక్ కల్యాణ్ మేళా కొనసాగుతోంది.

లోక్ కల్యాణ్ రుణంతో..

ప్రభుత్వం లోక్ కల్యాణ్ రుణంతో కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలనే ఆశయంతో ముందుకు సాగుతోంది. నంద్యాల పట్టణంలో వీధి వ్యాపారులకు రుణం అందించనున్నారు. గతంలో ఉన్న పీఎం స్వానిధి-2.0 (లోక్ కల్యాణ్) ద్వారా ప్రధాన మంత్రి మోదీ పుట్టిన రోజు సందర్భంగా లోక్ కల్యాణ్ మేళా పథకానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో గాంధీచౌక్, బస్టాండు ప్రాంతం, టెక్కె ప్రాంతం, నూనెపల్లె, బొమ్మలసత్రం, ఎన్జీవో కాలనీ, శ్రీనివాసనగర్, సంజీవనగర్, వంటి ప్రాంతాలే కాకుండా చుట్టూ పక్కల ప్రాంతాలైనా మహానంది మండలం, గోస్పాడు మండలం నుంచి చాలా మంది వచ్చి చిరు వ్యాపారం చేసుకునే వారు ఉన్నారు. తోపుడుబండ్లు, పై వీధివ్యాపారం తో కుటుంబాలను పోషించుకుంటున్నారు. తమ పిల్లల్ని చదివించుకుంటు ప్రయోజకులుగా తీర్చిదిద్దుకుంటున్నారు. అలాంటి వీరికి లోక్ కల్యాణ్ పథకం వరమని చెప్పాలి.

నంద్యాల పట్టణానికి సంబంధించి..

వీధి వ్యాపారులు	: 4250
గుర్తింపు కార్డులు ఉన్నవారు	: 3800
పీఎం స్వానిధికి అర్హులు	: 3800
లబ్ధి పొందిన వారు	: 3620
లోక్‌కల్యాణ్ మేళాకు ఎంపికైనవారు	: 820

మెప్మా కార్యాలయంలో రిసోర్స్ పర్సన్ ద్వారా..

మెప్మా కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలి. ఇప్పటికే పట్టణంలో సర్వే నిర్వ హించారు. పేర్లు నమోదైన వారు పట్టణంలోని మెప్మా కార్యాలయంలో సంబంధిత రిసోర్స్ పర్సన్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మొదట రూ.15వేలు అందజేస్తారు. నెలవారి కంతులు సక్రమంగా చెల్లించుకుంటే తర్వాత రూ.25వేలు ఇస్తారు. మూడో విడతలో రూ.50వేలు రుణం ఇస్తారు. డిజిటల్ పేమెంట్ చేయడానికి అవసరమైన క్యూఆర్ కోడ్ ఇస్తారు.

ఆరోగ్య, జీవిత బీమాతో పాటు..

వీధి వ్యాపారులకు ఆరోగ్య, జీవిత బీమాతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సాయం లభిస్తుంది. 18 ఏళ్లు పైబడిన వారు పట్టణ, స్థానిక సంస్థల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉన్న వారు, కాయగూరలు, పండ్లు, టీ, కాఫీ, ఫాస్ట్ ఫుడ్, బజ్జీలు, పూలు, చిన్న దుకాణాలు నిర్వహించే వారిని అర్హులుగా గుర్తిస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం.

ఇటీవలనే లోక్ కల్యాణ్ మేళా నిర్వహించాం. ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులకు ఎంతో మేలు చేకూరుతుంది. తమ కుటుంబాలు ఆర్థికంగా ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చు. చిరు వ్యాపారులకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

-బండి శేషన్న, కమిషనర్, మున్సిపల్, నంద్యాల

స్వచ్ఛందంగా దుకాణాల తొలగింపు



దుకాణాలను తొలగించుకుంటున్న నిర్వాహకులు



తొలగించిన దుకాణం పైకప్పు

- ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం
- దుకాణ యజమానులకు పలువురి అభినందనలు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న దుకాణాలను యజమానులు గురువారం స్వచ్ఛందంగా తొలగించారు. వీరిని పలువురు అభినందించారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డుకు అడ్డంగా ఉన్న దుకాణాలను తొలగించాలని నగరపాలక అధికారులు చెప్పినా దుకాణ యజమానులు స్పందించలేదు. ఈ విషయమై అధికారులు గతంలో కోర్టును ఆశ్రయించారు. దుకాణ యజమానులు సైతం కోర్టుకు వెళ్లారు. దీంతో సంవత్సరాల కాలయాపన జరిగింది. ఈక్రమంలో నగరపాలక అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈమేరకు ఇటీవల హైకోర్టు నుంచి దుకాణాలను తొలగించాలని ఉత్తర్వులు వెలువడ్డాయి.

హైకోర్టు ఉత్తర్వుల మేరకు నగరపాలక కమిషనర్ కూడా దుకాణాలను తొలగించాలని యజమానులకు నోటీసులు జారీచేశారు. ఈ క్రమంలో నగరపాలక అధికారుల ఆధ్వర్యంలో దుకాణాల తొలగింపు అవసరం లేదని, తామే స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించుకుంటామని యజమానులు ముందుకొచ్చి తొలగించారు. ఎన్నో ఏళ్లుగా సమస్యగా ఉన్న రహదారికి మోక్షం లభించింది.

చనిపోతూ ఇద్దరికి చూపు ప్రదానం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు వెంకటరమణ కాలనీ రోడ్ నెంబర్-5లో ఉన్న సుజాతమ్మ (65) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు.



సుజాతమ్మ (ఫైల్)

సుజాతమ్మ మరణవార్త విషయం తెలిసిన వెంటనే మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు గూడూరు యుగంధర్ శెట్టి, శోభన్‌బాబు ఇంటికి వెళ్లి పరామర్శించి నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. చనిపోయిన ఆమె వల్ల ఇద్దరికి చూపు వస్తుందన్న ఉద్దేశంతో నేత్రదానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈవిషయాన్ని మానవతా సంస్థ రెడ్‌క్రాస్ సంస్థ కౌన్సిలర్ ప్రదీప్‌కు తెలియజేశారు. ఆయన వచ్చి రెండు నేత్రాలను సేకరించారు. నేత్రదానం చేయా లనుకున్న వారు మానవతా సంస్థ సెల్‌నంబర్లు 9000090920, 9398110551ను సంప్రదించాలని కోరారు.

ప్రాజెక్టులను పూర్తి చేయించాలి

కర్నూలు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గుండ్రేవుల, వేదవతి, సిద్ధేశ్వరం అలుగు ప్రాజెక్టులను పూర్తి చేయించాలని జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యుడు జె. లక్ష్మీనరసింహ కోరారు. గురువారం విజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు



షర్మిలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వైఎస్ షర్మిలకు కోడుమూరు ఇన్‌చార్జి అనంతరత్నం మాదిగతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆదోని డివిజన్‌లో వలసలను నిర్మూలించాలని, ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఎమ్మిగనూరు కోఆర్డినేటర్ ఖాసింవలి, పత్తికొండ కోఆర్డినేటర్ బి. క్రాంతి నాయుడు, మహేంద్ర నాయుడు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో పంటను కాపాడుకోండి

ఓర్వకల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సస్య రక్షణ చర్యలతో పంటలను కాపాడుకోవాలని ఏవో మధుమతి రైతులకు సూచించారు. బుధవారం ఓర్వకల్లు, హుశేనాపురం, గుట్టపాడు గ్రామాల్లో రైతులు పొగాకు పంటను పరిశీలించారు. ఆకులు పచ్చగా మారడంతో రిడోమిల్ ఎంజీ 2గ్రాముల నీటిని లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ 2 గ్రాములు 1 లీటరు నీటికి లేదా మెటాలాక్సిల్ 2 గ్రాములు లీటరు నీటికి మొక్క మొదలు బాగా తడిసేదాకా వారం వ్యవధిలో మార్చి మార్చి పిచికారీ చేయాలన్నారు. అలాగే అమ్మోనియం సల్ఫేట్ 20 కేజీ ఎకరాకు చొప్పున మొక్కకు 5సీ.ఎం దూరంలో పొలం ఆరేలోపు వేసువాలన్నారు. ఆకులు రాలిపోతున్న పొలాల్లో రిడోమిల్ ఎంజీ 2 గ్రాముల లీటరు నీటికి 19-19-19 రకం 10 గ్రాముల ఒక లీటరు నీటికి పిచికారీ చేస్తే పంట సాధారణ స్థితికి వస్తుందన్నారు.

'అశోకా'అధ్యాపకులకు డాక్టరేట్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులకు వేరు వేరు విశ్వవిద్యాలయాలు డాక్టరేట్‌ను



శశి భూషణ్, శ్రీనివాసరెడ్డి, డి.శ్రీదేవి

ప్రదానం చేశాయి. డా.డి.శ్రీదేవి (గణిత శాస్త్రం)కు కుప్పం ద్రవిడ యూనివర్సిటీ నుంచి డా.డీవీ రామిరెడ్డి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పొందారు. అలాగే సివిల్ ఇంజనీరింగ్‌లో శివానందరెడ్డి తమిళనాడు, చెన్నై ఎస్ఆర్ఎం సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ పీహెచ్‌డీలో ప్రొఫెసర్ డా.ఎస్.ఆనంద్ పర్యవేక్షణలో చేశారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ విభాగానికి చెందిన డా.ఎంఏ శశి భూషణ్‌కు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ ఎం.సుధాకర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పట్టాను పొందారు. ప్రిన్సిపాల్ నవీన్, సీఈవో డా.హరీష్‌కృష్ణ అభినందించారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి



మొక్క నాటుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, లీలా వెంకట శేషాద్రి అన్నారు. గురువారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, డా. నాగన్న, శ్రీనివాసరెడ్డి, ఫక్రున్నీసా బేగం, వి. వింధ్యావాసిని దేవీ, కామల్లీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల ఆందోళన

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని అవుట్ డోర్ స్టేడియం వద్ద చిరు వ్యాపారులు గురువారం ఆందోళనకు దిగారు. గతంలో తాము ఇక్కడే వ్యాపారులు చేసుకునేవారమని నగర పాలక అధికారులు లాటరీలో ఇతరులకు అవకాశం ఇవ్వడంతో తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు కమిషనర్‌కు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్.మురళీమోహన్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి సి.రఘు, సంయుక్త కార్యదర్శి పవన్ తదితరులు పాల్గొన్నారు.

హైవే నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు



హైవేపై గుంతలను చూపుతున్న పట్టణ పౌరులు


కర్నూలు రూరల్ నవంబరు 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి నిర్వహణను నిర్లక్ష్యం చేయొద్దని పట్టణ పౌరుల సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, ఫుడ్ బ్యాంక్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కాలనీవాసులు యూనస్, జిలానీ డిమాండ్ చేశారు. గురువారం ఆటోనగర్ నుంచి సంతోష్‌నగర్ వరకు దెబ్బతిన్న సర్వీసు రోడ్లను పరిశీలించారు. జాతీయ రహదారికి ఇరువైపులా గుంతలు ఏర్పడి నీరు నిలిచి వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టోలుగేట్ రుసుం వసూలు చేయడం తప్ప రహదారుల పరిస్థితిని పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంజనేయులు, అన్వర్‌బాషా, శ్రీనివాసులు, నయిమ్, ఆయూబ్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో క్రీడల్లోనూ రాణించాలని ఏజీఎం అన్వర్ బాషా సూచించారు. గురువారం మాధవనగర్ నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ మహ్మద్ అల్తాఫ్, కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, ధృవపత్రాలు అందజేశారు.

విద్యుదుత్పత్తి కేంద్రంలో ప్రమాదం

శ్రీశైలం నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం కుడిగట్టు జల విద్యుదుత్పత్తి కేంద్రంలో ప్రమాదం జరిగింది. గురువారం మధ్యాహ్నం సమయంలో కార్మికులు మరమ్మతు పనులు చేస్తుండగా నాల్గవ యూనిట్ ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. ఘటనలో ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానంగా ఉండే లైటింగ్ ఎరాస్టర్ ఊడిపోయి సమీపంలో పని చేస్తున్న కిరణ్ అనే కాంట్రాక్ట్ లేబర్ తలకు తగిలి గాయాలయ్యాయి. అప్రమత్తమైన సహాసి బృంది అతడ్ని సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కిరణ్ తలకు మూడు కుట్లు పడ్డాయి. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. విద్యుదుత్పత్తి కేంద్రంలో ఘటనతోపాటు కిరణ్ ఆరోగ్య పరిస్థితిపై ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు తెలిసింది.



ప్రమాదానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్

ప్రైవేటుకు అప్పగించడం తగదు

- బందార్లపల్లె చెక్ పోస్టు వద్ద ఉద్రిక్తత
- తరలి వచ్చిన గనుల యజమానులు, కార్మికులు



రాయల్టీ చెక్‌పోస్టు వద్ద యజమానులు, కార్మికులు

కొలిమిగుండ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయల్టీ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించడం తగదని గనుల యజమానులు అన్నారు. గురువారం మండలంలోని బందార్లపల్లె రాయల్టీ చెక్‌పోస్టు వద్ద గనుల యజమానులు, కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. రాయల్టీ (సీనరేజ్) వసూ లు చేసే విషయంలో ప్రైవేటు సంస్థ అనేక నిబంధనలను పెట్టి నాపరాయి పరిశ్రమ వర్గాలకు తీవ్ర ఇబ్బందులకు కలగజేస్తుందని వారు వాపోయారు. రాయల్టీ చెక్‌పోస్టు వద్దకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీఐ రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి రాయల్టీ చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. నిరసన చేపట్టరాదని ప్రైవేటు సంస్థ వారితో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సీఐ సూచించారు. అక్కడికి చేరుకున్న అవుకు మండల టీడీపీ అధ్యక్షుడు ఉగ్రసేనా రెడ్డి, మూలే హుసేన్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి చెక్‌పోస్టు సిబ్బందితో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. రాయల్టీ వసూలు విషయంలో గనుల యజమానులు, కార్మికులతో సమావేశం నిర్వహించి కొన్ని నిబంధనలు సడలించాలని వారు ప్రవేటు సంస్థ సిబ్బందికి వారు విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల్లో కొలిమిగుండ్లలో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చలు జరుపుతామని గనుల యజమానులు వివరించారు. నాపరాళ్ల లోడుతో అక్కడికి చేరుకున్న ట్రాక్టర్లు రాయల్టీ పన్ను చెల్లించకుండానే తాడిపత్రి వైపు తరలివెళ్లాయి.

రోగులకు కొత్త సప్త వర్ణ దుప్పట్లు



కొత్త దుప్పట్లను విడుదల చేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి హాలులో లియోటెక్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో నూతన స్వచ్ఛ సప్తవర్ణ దుప్పట్లను హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ సప్తవర్ణ దుప్పట్లు పంపిణీని 2017 మే 24న ప్రారంభించారని, ఇప్పటి వరకు ప్రతి 60 ఉతుకుల తర్వాత మారుస్తామన్నారు. అదే విధానంలో 60 ఉతుకులు అయినందున గురువారం నుంచి నూతన స్వచ్ఛ సప్తవర్ణ దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో ఉండే రోగులకు ప్రతి రోజు కలర్ దుప్పట్లు, ఐడెంటిఫికేషన్ చేసి ప్రతి రోజు ఒక బెడ్‌షీట్ ఉండేటట్లు చూసుకోవాలని నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రిబాయిని ఆదేశించారు.హాస్పిటల్ సీఎస్ ఆర్ఎంవో డా.పద్మజ, ఆర్ఎంవో డా.వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం, లియోటిక్ మేనేజర్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

నిరంతరం విద్యుత్ సరఫరా చేయండి

కల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించి వినియోగ దారులకు నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ప్రదీప్‌కుమార్ ఆదేశించారు. గురువారం విద్యుత్ భవన్‌లో ఆయన కర్నూలు టౌన్ డివిజన్ విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వినియోగదారుల్లో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పెంచుటకు అధికారులు, విద్యుత్ సిబ్బంది అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పీఎం సూర్యఘర్ స్కీం కింద సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకునేలా ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సెక్షన్ అధికారి వినియోగదారులకు లోవోల్టేజీ సమస్య లేకుండా చూడాలని, ఓవర్ లోడ్ ఉండే 11కేవీ ఫీడర్లను బైఫర్‌కేట్ చేసి అదనపు ఫీడర్లను ఏర్పాటు చేయాలని ఎస్ఈ ఆదేశించారు. అకౌంట్స్ ఆఫీసర్ చిన్నరాఘవులు, టెక్నికల్ ఈఈ వైవీ.మహేశ్వరరెడ్డి, కన్‌స్ట్రక్షన్ ఈఈ భాస్కర్‌రావు, టౌన్ ఈఈ టి.శేషాద్రి, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

హాలహర్వి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘా తంతో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సిద్ధాపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన భీమేష్, శాంతమ్మ దంపతులకు నలుగురు సంతానం. ముగ్గురు ఆడపిల్లలు కాగా నాలుగో సంతానం సోమశేఖర్(12) జన్మించాడు. సోమశేఖర్ గురువారం ఇంట్లో బోరు నీటి కోసం విద్యుత్ బటన్ నొక్కాడు. విద్యుదాఘాతానికి గురై కుప్పకూలి పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడు అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. ఒక్కగానొక్క కుమారుడిని మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వివాహిత బలవన్మరణం

నంద్యాల టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన పట్టణంలో నబీనగర్‌లో చోటుచేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. కాలనీకి చెందిన కరీమున్(27) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

వ్యభిచారగృహ నిర్వాహకుల అరెస్టు

నంద్యాల టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ అస్రర్‌బాషా గురువారం తెలిపారు. వివరాలు.. పట్టణంలోని ఒక ప్రధాన ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు ఇంటిపై దాడిచేసి నిర్వాహకులు రమేశ్, మున్నాను అరెస్టు చేశామన్నారు. మరో మహిళను అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

మంత్రాలయం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన బాలుడు తప్పిపోగా పోలీసులు పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. బెంగుళూరుకు చెందిన శ్రీనివాస్, రేఖలతో పాటు నాలుగేళ్ల కొడుకు మాన్విక్‌తో మంత్రాలయంకు వచ్చారు. గురువారం శ్రీమఠం ప్రాంగణంలో మాన్విక్ తప్పిపో యాడు. వెంటనే తల్లిదండ్రులు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. స్పందించిన పోలీసులు తల్లిదండ్రులు ఇచ్చిన ఫొటో ఆధారంగా మార్వాడీ షాపు దగ్గర ఏడుస్తున్న బాలుడిని గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు బాలుడిని ఎస్ఐ శివాంజల్, కానిస్టేబుల్ రామకృష్ణలు అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు, భక్తులు పోలీసులను అభినందించారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

- అరుణోదయ తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న విమలక్క

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క అన్నారు. గురువారం స్థానిక ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయం వద్ద నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ పాటల సీడీని ఆమె ఆవిష్కరించారు. భూమి కోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం పోరాడి నేలరాలిన ఎందరో అమరవీరులకు విప్లవ జోహార్లు అర్పిస్తూ నవంబర్ మాసమంతా ఊరురా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికే ఆపరేషన్ కగార్ పేరుతో అడవులపై, ఆదివాసులపై మిలటరీ, పారా మిలిటరీ, డీఆర్జీ బలగాలతో అడవులను ముట్టడించి మావోయిస్టులను పొట్టన పెట్టుకుంటున్నారని విమర్శించారు. తక్షణమే ఆపరేషన్‌ను నిలిపివేసి విప్లవకారులతో శాంతి చర్చలు జరపాలని ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాషా, డీటీఎఫ్ నాయకుడు రత్నం ఏసేబు, కేవీపీఎస్ నాయకుడు సుబ్బారాయుడు, విప్లవ కళాకారుడు పోతన, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకుడు శేషఫణి పాల్గొన్నారు.

గ్యాస్ లీకై ఇంట్లో మంటలు

- రూ.15లక్షల ఆస్తి నష్టం

వెల్దుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకై ఇంట్లో మంటలు చెలరేగాయి. దీంతో ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘటన మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గంటె రామాంజ నేయులు బెస్తవీధిలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. గురువారం తల్లి, భార్య పొలం పనులకు, ఇద్దరు పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో పెద్ద పేలుడు శబ్దం రావడంతో గ్రామస్థులంతాతా భయందోళనకు గురయ్యారు. రామాంజనేయులు ఇంట్లో మంటలు వస్తుండడంతో అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. డోన్ అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్, బట్టలు, ధాన్యం, బీరువాలో ఉన్న నగదు రూ.1లక్ష, 6తులాల బంగారు, 15తులాల వెండి ఆభర ణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంటి పైకప్పు, తలుపులు, వరండాలో ఉన్న కడ్డీల వాకిలి, మెట్లు దెబ్బతిన్నాయి. గ్యాస్ లీకు కావడం వల్లె ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు ధ్రువీకరించారు. రూ.15లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్లు బాధిత కుటుంబం పేర్కొంది. కట్టుబట్టల తప్ప ఏమి మిగలలేదని కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. గ్యాస్ లీకైన సమయంలో ఇంటిలో కుటుంబ సభ్యులెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.



కాలిపోయిన బీరువా

ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలి

- సబ్ డివిజన్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- ఎల్లెల్సీ కెనాల్‌ను పరిశీలించిన రైతులు



అక్రమ మోటార్లను చూపుతున్న ఆయకట్టు రైతులు

కోడుమూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో చివరి ఆయకట్టు దాకా ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం పులకుర్తి, గూడూరుకు చెందిన చివరి ఆయకట్టు రైతులు ఎల్లెల్సీ కెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు నాగిరెడ్డి, విజయభాస్కరరెడ్డి, తిమోతి మాట్లాడుతూ కోడుమూరు సెక్షన్‌లో చివరి ఆయకట్టుకు సుమారు 25ఏళ్లకు పైగా సాగునీరు అందడం లేదని ఆరోపించారు. వర్షాధార పంటలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఈఏడాది అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, రైతులు తీవ్రనష్టాలపాలయ్యారని విచారం వ్యక్తం చేశారు. అడుగడుగునా నానాయకట్టుదారులు మోటార్లు వేసుకుని సాగునీరు వాడుకుంటున్నారని తెలిపారు. దాదాపు 2 వేల ఎకరాలు వరకు నానాయకట్టు సాగవుతోందని రైతులు అన్నారు. అధికారులు మామూళ్ల మత్తులో పడి చివరి ఆయకట్టును పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రబీ సీజన్‌లో చివరి ఆయకట్టు దాకా ప్రతి ఎకరాకు సాగునీరు పారించాలని డిమాండ్ చేశారు. సాగునీరు ఇవ్వని పక్షంలో రైతులను సమీకరించి సబ్‌డివిజన్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామకోటిరెడ్డి, లింగన్న, కర్ణ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు వినతి


మంత్రి లోకేశ్‌తో విజయ్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాయి బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్ కోరారు. గురువారం రాష్ట్ర విద్యాశాఖ, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో కలిశారు. నాయి బ్రాహ్మణుల సమస్యలపై విన్నవించగా, ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పరిమితికి మించి ఎక్కించుకోవద్దు

● ఎస్పీ విక్రాంత్ పాటిల్


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటోలు, స్కూలు బస్సులలో ప్రయాణికులు, విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించుకోవద్దని పోసులు హెచ్చరించారు. గురువారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు నగరంలోని కళాశాలలు, పాఠశాలల యజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, స్కూల్ బస్సులలో ఓవర్‌లోడుతో ప్రయాణిస్తే ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. రాంగ్ రూట్లలో ప్రయాణం వద్దని, తిగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపి ట్రాపిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు..

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం నగరంలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యాసంస్థల వద్ద యాంటీ ఈవ్ టీజింగ్ బీట్లను ఏర్పాటు చేశారు. సమస్య ఉంటే డయల్ 112 లేదా 100కు డయల్ చేయాలని దిశా నిర్దేశం చేశారు.

నగర పాలిక సెక్రటరీగా బి.నాగరాజు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ సెక్రటరీగా బి.నాగరాజును నియమిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న నాగరాజుకు ఇటీవలే గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ నెల 11న జిల్లా అభివృద్ధిపై చర్చాగోష్ఠి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చా గోష్ఠి నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ అధ్వర్యంలో జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు తెలిపారు. గురువారం మాట్లాడుతూ రాయలసీమ ముఖద్వారం నాటి రాష్ట్ర రాజధాని, దేశానికి ప్రధాని, కేంద్ర మంత్రులను అందించినా, అభివృద్ధిలో మాత్రం ఆమడదూరంలో ఉందన్నారు. బీసన్న, చంటి, నవీన్, రాజు పాల్గొన్నారు.





కనకదాసు జయంతిని నిర్వహిద్దాం

కర్నూలు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న భక్త కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహిద్దామని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. గురువారం సాయంత్రం జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కర్నాటక, తెలంగాణతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా నిర్వహిస్తోందని కళ్యాణ దుర్గంలో మంత్రి నారాలోకేష్ హాజరవుతారని పెర్కొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు

చిలకలపర్వి బ్రిడ్జి కం బ్యారేజీకి అవకాశం లేదు.

కర్నాటక ప్రభుత్వం చిలకలపర్వి వద్ద బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించే పరిస్థితి లేదని జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రజా ప్రతినిధులు, ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబును కలుస్తామన్నారు. ప్రతికల్లో కథనాలకు జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

గూడూరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జి.హనుమంత రెడ్డి హెచ్చరించారు. గురువారం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. పేకాట, మట్కా జోలికి వెళ్లవద్దని, ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

చెరువులో చేపలు వదలండి

సి.బెళగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువులో చేపలను వదాలని సి.బెళగల్ మత్యకారుల సంఘం నాయకులు కోరారు. గురువారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి విష్ణు వర్ధన్‌రెడ్డికి విన్నవించారు. స్పందించిన ఇన్‌చార్జి మత్యశాఖ అధికారులతో మాట్లాడి చేపలను వదిలేలా చుస్తానని హామీ ఇచ్చారు.

ఈకేవైసీ తప్పనిసరి

సి.బెళగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము చేసే పంటలకు ఈకేవై తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో మల్లేష్‌కుమార్ సూచించారు. సమీపంలోని రైతు సేవా కేంద్రాలల్లో సంప్రదించాలని, రబీ పంటలకు సేంద్రియ ఎరువులను వాడాలన్నారు.


నగరాభివృద్ధికి పెద్దపీట

కల్లూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పేర్కొన్నారు. గురువారం 19వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జోహరాపురం రోడ్డు, మదర్‌ల్యాండ్, రామప్రియనగర్‌లో రూ.కోటితో బీటీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. వెంకటాద్రినగర్‌లో సీసీ రోడ్డు, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. వార్డు ఇన్‌చార్జ్ ప్రభాకర్‌యాదవ్, పురుషోత్తంరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న గౌరుచరితారెడ్డి

















జిల్లా, రాష్ట్ర స్థాయికి విద్యార్థులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అండర్-14, 17 బాస్కెట్ బాల్ పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని గార్గేయాపురం పాఠశాల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకట్రాముడు అన్నారు. ఎం.నాసీర్‌భేగ్ బాలుర విభాంలో, బాలికల విభాగంలో జయలక్ష్మి ఎంపికైందన్నారు. అండర్-14 క్రీడాకారులు అన్నమయ్య జిల్లాలో ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగే 69వ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగే 69వ రాష్ట్రస్థాయియి బాస్కెట్‌బాల్ అండర్-17 పోటీల్లో భువనేశ్వరి కర్నూలు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.







నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణంలోని తన స్వగృహం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే వాటిని సంబంధిత శాఖల అధికారులకు తెలియజేసి పరిష్కారమయ్యేవిధంగా చేస్తామన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఎండీ వెంకట మాధవ్

మద్దికెర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీసాయి విద్యాకళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కాలువ యువరాజ్ అనే విద్యార్థి జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపిక కావడంతో కళాశాల ఎండీ యజ్ఞం వెంకట మాధవ్ గురువారం కళాశాలలో అభినందించారు. శ్రీకాకుళంలో అండర్-19 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు కళాశాలలో జరిగాయనీ, అక్కడ ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయికి ఎంపికయ్యారనీ తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా రాణించి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థికి క్రీడలతో పాటు చదువు కూడా చాలా ముఖ్యమన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాల సునీత, అధ్యాపకులు ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయండి

హాలహర్వి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్థాంతరంగా నిలిచిపోయిన గృహ నిర్మాణాల పనులు వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చాలా గ్రామాల్లో బిల్లులు అందకపోవడం వల్లే గృహ నిర్మాణాలు పూర్తి కాలేదని తమదృష్టికి వచ్చిందన్నారు. అందువల్ల హౌసింగ్ అధికారులు వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. బిల్లులు ఖాతాలో జమ అయిన వెంటనే కార్యదర్శులు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ఆలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్ ఫెడరషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జావిలిన్ పోటీల్లో ఆలూరు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆలూరు విద్యార్థి సంజీవరాజు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికైనట్లు ప్రిన్సిపాల్ జమ్మన్న తెలిపారు. విద్యార్థిని పాఠశాల సిబ్బంది అభినందించారు. నెలాఖరులో గుంటూరులోని వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొంటున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శివను అభినందించారు.


పోటీలకు ఎంపికైన విద్యార్థితో ప్రిన్సిపాల్ జయన్న

పత్తి రైతులను ఆదుకోవాలి

మద్దికెర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు సాగు చేసిన పత్తి పంట పూర్తిగా కుళ్లిపోయిందని, పత్తి రైతులను ఆదుకోవాలని మండల సీపీఐ కార్యదర్శి ఎం.అగ్రహారం నాగరాజు, మండల రైతు సంఘం అధ్యక్షులు నాగిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కోదండరాముడు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పత్తి రైతుల సమ్మేళనంలో ఆదోనిలో ఈ నెల 18, 19 తేదీల్లో జరుగుతుందని రైతులందరూ పాల్గొనాలని కోరారు. బొజ్జన్న, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఇల్లు నిర్మించుకోకపోతే ప్లాట్లు రద్దు చేస్తాం

తుగ్గలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలంలో ఇల్లు నిర్మించుకోకపోతే పట్టా రద్దు చేస్తామని ఎంపీడీవో విశ్వ మోహన్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో స్థలాలు ఉండి.. ఇంటి స్థలం మంజూరైనా నిర్మించుకోకుండా ఉంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు. ఇల్లు నిర్మించుకునేలా వారికి అవగాహనక కల్పించాలన్నారు. ఇల్లు నిర్మించుకోకపోతే వారి పట్టాలను రద్దు చేస్తామన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి: సీపీఐ

వెల్దుర్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):అర్హులైన పేదవారందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాజకీయ జోక్యం లేకుండా గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణం కొరకు రూ.5లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామాంజనేయులు, చిన్నమాదులు, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న గుంతలు

● అధ్వానంగా ఆదోని ఆర్‌అండ్‌బీ రోడ్డు
● పది రోజుల్లోనే ఇద్దరు బైకు రైడర్లు మృతి
● నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు


నీటికుంటను తలపిస్తున్న ఆదోని ఆర్‌అండ్‌బీ రోడ్డు


ప్రమాదానికి నిలయమైన ఆదోని ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంత

ఆస్పరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదం ఏ అంచున పొంచి ఉందో తెలియని అభాగ్యులు తమ అవసరాల నిమిత్తం ప్రయాణం కొనసాగిస్తూ అస్తవ్యస్తమైన రోడ్ల దుస్థితిని గమనించక మృత్యుఒడికి చేరుతున్నారు. మండలంలోని నగరూరు-ఆదోని ఆర్‌అండ్‌బి రోడ్డు గుంతలమయమై శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోకపోవడంతో ఆ రోడ్డుగుండా వెళ్లే వాహనదారులు నిత్యం ప్రమాదాలబారిన పడుతూ మృత్యుఒడికి చేరుతున్నారు. గడిచిన పది రోజుల్లో ఇద్దరు మృత్యువాత పడగా.... అందులో ఒకరు బ్యాంకు మేనేజర్ కాగా, మరొక వ్యక్తి ఫోటోగ్రాఫర్. ఆ గుంత తెలియక బైకుపై రైడ్ చేస్తూ అదుపు తప్పి రోడ్డుకు తల తగిలి అక్కడికక్కడే మృతిచెందారు. ఆర్‌అండ్‌బి అధిఆకరులు స్పందించి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దు

ఆలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్‌లో ర్యాగింగ్, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ మన్మథవిజయ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ బాధ్యత డ్రైవర్లదే

ఆదోని రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే డ్రైవర్ల చేతుల్లోనే ఉందని రూరల్ సీఐ నల్లప్ప తెలిపారు. గురువారం నెట్టేకల్ క్రాస్‌వద్ద వాహనాలను తనిఖీ చేపట్టడంతో పాటు విద్యార్థులను పాఠశాలకు తరలించే ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ వెంట ఎస్ఐ రామాంజనేయులు ఉన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

తుగ్గలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని జొన్నగిరిలో వాహనాలు తనిఖీ చేయడంతో పాటు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి దిశా నిర్దేశం చేశారు. రోడ్డు భద్రత నియామాలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

పెద్ద హరివాణాన్ని మండలం చేయాల్సిందే..

ఆదోని రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా ప్రకటించాల్సిందేనని పెద్దహరివాణం మండల కమిటీ నాయకులు ఆది నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఇందులోభాగంగా, గురువారం గ్రామస్థులు నాయకులతో కలిసి ఆదోని - శిరుగుప్ప రహదారిలో కూర్చొని ధర్నా చేపట్టారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకొన్న ఇస్వీ ఎస్.ఐ మహేష్ కుమార్ సిబ్బంది కలిసి గ్రామానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా కూర్చొన్న వారిని లేవాలని కోరారు. అయిన వారు ససేమీరా అనడంతో ఆదినారాయణరెడ్డితోపాటు మరో నలుగురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మండలం కోసం పోరాటం చేస్తున్న వారిని అరెస్టు చేయడం దురదృష్టకరమని పలువురు వాపోయారు.

లక్షలు వెచ్చించి వదిలేశారు..

ఆలూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండాలనే లక్ష్యంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వహయాంలో రూ.7 లక్షలు వెచ్చించి మొలగవల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మించింది. అయితే భవనానికి ప్రహరీగోడ లేకపోవడం, ముళ్లకంప పెరిగి ప్రస్తుతం పందులకు ఆవాసంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌ను ఆర్‌డీటీ భవనంలో సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. గ్రామంలో పశువుల ఆసుపత్రి పక్కన అంగన్‌వాడీ కేంద్రం-4ను టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక అంగన్‌వాడీ భవనాలు, సౌకర్యాలను విస్మరించడంతో అంగన్‌వాడీ కేంద్ర భవనానికి ప్రహరీగోడ లేకపోవడంతో ముళ్లకంపతో నిండిపోయింది. మరోవైపు పందుల బెడద ఎక్కువగా ఉండడంతో దుర్వాసన భరించలేక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్‌డీటీ భవనంలో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. లక్షలు వెచ్చించి నిర్మించిన అంగన్‌వాడీ భవనం నిరుపయోగంగా ముళ్లకంపలో మిగిలింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం చేపట్టి అంగన్‌వాడీ భవనం అందుబాటులోకి తీసుకుని రావాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.


మొలగవల్లి గ్రామంలో ముళ్లకంపలో అంగన్‌వాడీ కేంద్రం

ఉల్లి రైతులకు పరిహారం ఎప్పుడు?


విలేకరులతో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

మద్దికెర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50వేలు ప్రకటించి నెల రోజులు గడుస్తున్నా పరిహారం ఇవ్వలేదని, ఈ పరిహారం రైతులకు ఎప్పుడు ఇస్తారని జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, మండల వైసీపీ ఉపాధ్యక్షులు కృష్ణా యాదవ్, ఎస్సీ సెల్ నాయకులు గంధం చంద్ర ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలోని మద్దికెరలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురవడం వల్ల రైతులు నల్లరేగడి పొలాల్లో దాదాపు 10వేల ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారన్నారు. అధికవర్షాలు, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు పొలాల్లోనే ఉల్లి పంటను వదిలేశారనీ అన్నారు. ప్రభుత్వం పరిహారం ప్రకటించినా ఇంత వరకు ఇవ్వలేదని అన్నారు.మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ మండలంలో కోటి సంతకాల సేకరణ వేగవంతమైందన్నారు.

ఉత్సవ ఏర్పాట్లు వేగవంతం


ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న కురువ కులస్తులు

ఆదోని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉత్సవ ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. ఈ మహత్తర వేడుకను విజయవంతం చేయడంలో భాగంగా ఏపీ రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 8న అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం వేదికగా జరిగే ఈ రాష్ట్ర పండగకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను కర్నూలు జిల్లా నలుమూలలో ఉండే కురువ కులస్తులకు ప్రత్యేకంగా అందజేస్తున్నారు. కేవలం పండగ నిర్వహణతో సరిపెట్టకుండా భక్తులందరూ ఉత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

హాలహర్వి : ఈనెల 8న జరగబోయే కనకదాస్ జయంతి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని జెడ్పీటీసీ లింగప్ప తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో విగ్రహాలను అలంకరించి పండగలా జరుపుకోవాలని, సాయంత్రం ఊరేగింపు చేపట్టాలని, కురుబల ఐక్యత చాటాలని ఆయన కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకండి


చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి)

మద్దికెర, నవం బరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలో ప్రజలు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మద్దికెర గ్రామంలో చెత్త సేకరణ ప్రదేశాలను పరిశీలించారు. చెత్త సేకరించే పంచాయతీ కార్మికులు, ప్రజల వద్ద నుంచి తడి, పొడి చెత్త వేరు చేసుకుని తీసుకుని రావాలన్నారు. ప్రజలు కూడా తడి పొడి చెత్త కలపకుండా వేరు చేసి పంచాయతీ కార్మికులకు అందజేయాలన్నారు. తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు పడుతున్నాయనీ, అందువల్ల ప్రజలు నీటిని వేడి చేసి వడబోసి చల్లార్చి తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సీఆర్పీలు సలోమీ, జానకి ఉన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజలంతా ఐక్యతతో అడ్డుకుందామని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఫయాజ్ అహ్మద్ అన్నారు. గురువారం వైసీపీ రాష్ట్ర కమిటీ పిలుపుతో పట్టణంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి తమ ప్రభుత్వం పూనుకుందన్నారు.ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఆక్రమణలు తొలగించండి

పత్తికొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):పత్తికొండ చెరువు కడగొమ్ము ప్రాంతంలో జరిగిన కబ్జాలను తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్‌తో పాటు ఇరిగేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తులకు నోటీసులు జారీచేస్తామని త్వరలోనే స్థలం స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ విలేకరులకు తెలిపారు.


చెరువు కబ్జా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చెరువులోకి దూసుకెళ్లిన లారీ

పత్తికొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):ఆదోని నుంచి ప్యాపిలికి వెళుతున్న ఆటో అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన సంఘటన పత్తికొండ ఫక్కుమియ్యా దర్గా సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఆ లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. అయితే లారీ దూసుకెళ్లిన ప్రాంతంలో చెరువు లోతు తక్కువగా ఉండడం, ముళ్ల కంచెలు పూడిక ఎక్కువగా ఉండడంతో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోలేదు.

ఎస్ఐను కలిసిన టీడీపీ నాయకులు

చిప్పగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి మండల ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌ను గురువారం టీడీపీ సీనియర్ నాయకులు రామదుర్గం నీటి సంఘం అధ్యక్షులు బెల్లకొండ రామచంద్ర, సోమశేఖర్‌నాయుడు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు బెల్డోన శీనలు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. గ్రామాల్లోని ప్రజలు ప్రశాంతంగా ఉండేలా భద్రత చర్యలు తీసుకోవాలని వారు ఎస్ఐను కోరారు. అలాగే ఏబీసీ కాలువ డీసీ ప్రెసిడెంట్ నగరడోన కిష్టప్ప ఆధ్వర్యంలో నగరడోన గ్రామస్తులు ఎస్ఐ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

కబ్జాపై చర్యలు తీసుకోండి: ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ స్థలాల కబ్జా పై అధికారులు కొరడా ఝుళిపించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆదేశించారు. గురువారం పత్తికొండ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గ పరిధిలోని అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారుల వివరించిన పెండింగ్ పనుల వివరాలను ఆయన సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఏ ప్రాంతాంలోనైనా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయితే తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు కీలకంగా వ్యవహరించాలన్నారు. పత్తికొండ చెరువు కడగొమ్ము ముందు ప్రాంతాన్ని కొందరు కబ్జా చేసి ఆక్రమించుకున్నారని వెంటనే వారికి నోటీసులు జారీచేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. అలాగే ఆదోని రహదారిలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టాల పేరుతో విలువైన స్థలాలు కబ్జాలు చేశారని వారికి నోటీసులు జారీచేసి స్థలాలు స్వాధీనం చేసుకోవాలని అలాంటి స్థలాలు పేదలకు పంచేందుకు ఉపయోగించాలన్నారు. ఏ గ్రామంలో భూములు ఆ గ్రామ పరిధిలో పేదలకే పట్టాలు కేటాయించాలని వేరే గ్రామాల వారికి అవకాశం ఇవ్వకూడదని సూచించారు. తుగ్గలిలో ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి కొందరు వ్యాపార సముదాయాన్ని నిర్మించాలని దానిపై సమగ్ర విచారణ చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. నాయకులు మార్కెట్ యార్డు చైర్మన్ ఆలంకొండ నబి, ఎస్టీ ట్రైబల్ కార్పొరేషన్ మెంబర్ వెంకటపతి, రాష్ట్ర నాయకుడు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు, జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, బానాల చౌదరి, తిమ్మయ్యచౌదరి,అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కేఈ ఎమ్మెల్యే శ్యాంబాబు

ఆధార్ కేంద్రం ఏర్పాటు

మద్దికెర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి విజయ్, టీడీపీ నాయకులు రమేష్‌బాబు, ఆనంద్ కుమార్ తెలిపారు. గురువారం ఎం.అగ్రహారం గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆధార్ కేంద్రం లేకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులతో మాట్లాడి ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర

ఆదోని రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసమే సీపీఎం పాదయాత్ర చేపట్టిందని నాయకులు లింగన్న, వెంకటేశులు తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈనెల 9,10వ తేదిల్లో గణేకల్లు, కడితోట, జి.హొసళ్లి, హనవాళ్, యడవల్లి, తదితర గ్రామాల్లో జీపు జాత ఉంటుందన్నారు. ముఖ్యంగా వేదావతి ప్రాజెక్టును నిర్మించాలని మండల రైతాంగానికి సాగు, తాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు.

బాలునికి తీవ్రగాయాలు

క్రిష్ణగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో బాలునికి తీవ్రగాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు..మండలంలో తెగడొడ్డి గ్రామానికి చెందిన మహేంద్ర(11) తండ్రి నాగరాజుతో కలిసి గురువారం పొలానికి వెళ్లాడు. పొలంలో తండ్రితో కలిసి పత్తి కట్టను కాలుస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి బాలుడు గాయపడ్డాడు. వెంటనే ప్రైవేటు వాహనంలో వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలు సర్వజనవైద్యశాలకు తరలించారు.

ఘనంగా హోమాలు


హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాల నీ మైదానంలో 87వ విశ్వ శాంతి మహాయాగంలో భాగంగా గురువారం లక్ష్మీ కుబేర, నరసింహ, ధన్వంతరి హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పాల్గొన్ని హోమాలు నిర్వహించారు. అలాగే పట్టణానికి చెందిన పలువురు భక్తులు తరలివచ్చి సామూహిక హోమాలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మహాయాగం నిర్వా హకులు, కృష్ణ మఠం పీఠాధిపతి స్వరూపానంద స్వామి పాల్గొని భక్త లకు ఆశీర్వాదాలు అందజేశారు.

ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు


ఎస్ఐను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, నవం బరు 6(ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ తిమ్మారె డ్డిని గురువారం నంద వరం టీడీపీ జగ్గాపురం నాయకులు మాజీ ఎంపీ టీసీ నరసింహులు, గట్టాల రంగన్న, తిమ్మప్ప, ఎల్ఐసీ గోపాల్ సన్మానించారు. ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. చిన్న చిన్న సమస్యలు పెద్దల సమక్షంలోనే పరి ష్కరించుకోవాలని సూచించారు.

బీజేపీని బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి

నందవరం, నవం బరు 6(ఆంధ్రజ్యోతి): బీజేపీని బలోపేతం చేసేం దుకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి అన్నారు. గురువారం నందవరం బీజేపీ కార్యా లయంలో పార్టీ తాలుకా నాయకుడు గురురాజారావు ఆధ్వర్యంలో కార్య కర్తల సమావేశం జరిగింది. సునీల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకా లను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి దయాసాగర్, బీఎల్ నారాయణ, రామన్నగౌడు, మెకానిక్ శ్రీనివాసులు, శివ, సుభాన్, మిన్నల్లా, గని పాల్గొన్నారు.

సాహితీ పురస్కారానికి ఉపాధ్యాయుడు ఎంపిక


సోమన్న

నందవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నాగలదిన్నె పాఠశాలలో గణిత ఉపా ధ్యాయుడిగా పనిచేస్తున్న గద్వాల సోమన్న పెండోట సాహితీ పురస్కారానికి (2025)కు ఎంపికైనట్లు శ్రీవాణీ సాహిత్య పరిషత్ అధ్య క్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. 16న అవార్డుతో పాటు నగదు కూడా అందజేస్తున్నట్లు నిర్వా హకులు తెలిపారు. గద్వాల సోమన్నను తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

బస్సు జాతాను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్

కోసిగి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరి ష్కారానికై జరుగుతున్న బస్సు జాతాను విజయవంతం చేయాలని, అలాగే ప్రభుత్వం తీసుకువచ్చిన పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని ఏఐ ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వీరేష్ అన్నారు. గురువారం కోసిగిలోని మోడల్ స్కూల్‌లో వారు మాట్లాడుతూ ఏఐఎస్ఎప్ రాష్ట్ర సమితి ఆధ్వ ర్యంలో ఇచ్చాపురం నుంచి హిందూపురం వరకు తలపెట్టిన బస్సు జాతా 10వ తేదీన కర్నూలు నగరానికి చేరుతుందని, ఆ రోజు జరిగే రాష్ట్ర మహాసదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రేక, సంగీత, కృష్ణమూర్తి వన్నూరు వలి, రాధా, అంజలి, ఆదిమూర్తి తదితరులు ఉన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

కౌతాళం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైనారని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్యలు అన్నారు. కౌతాళంలో గురువారం మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై మండలంలో ప్రచార జాతా కార్యక్రమంను పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 10న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరేష్, శంకర్, వలి, వీరేంద్ర ఉన్నారు.

ఆటోలు సీజ్


కోసిగి పోలీస్ స్టేషన్‌లో మట్కాబీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రమేష్ రెడ్డి, ట్రైనీ ఎస్ఐ ఈశ్వరరావు

కోసిగి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల కేంద్రంలో పరిమితికి మించి అధికంగా ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్న నాలుగు ఆటోలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. గురువారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు రోడ్డు సేఫ్టీపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రైనీఎస్ఐ ఈశ్వరరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

● మండల కేంద్రమైన కోసిగితో పాటు మండల పరిధిలోని వంద గల్లు, తదితర గ్రామాల్లో ఎవరైనా మట్కా రాస్తే కోసిగి మండల బహి ష్కరణ చేస్తామని కోసిగి ఎస్ఐ డి.రమేష్ రెడ్డి హెచ్చరించారు. గురు వారం గతంలో మట్కా రాస్తున్న మట్కాబీటర్లను పిలిపించి కోసిగి పోలీ సుస్టేషన్‌కి పిలిపించి కౌన్సిలింగ్ చేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ ఈశ్వరరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

● గ్రామాల్లో గొడవలకు, ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం ఎస్ఐ రమేష్ రెడ్డిని టీడీపీ మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డితో పాటు మండ లంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు ఎస్ఐని మర్యాదపూర్వ కంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్రాణి వెంకటేశ్, హాళగుంద కోసిగయ్య, రణ తిక్కన్న, గాలెం వీరేష్, బసప్ప, సాతనూరు కోసిగయ్య, సొట్టయ్య, పోతుల వీరారెడ్డి, ఖలందర్, నరసిం హులు, లక్ష్మయ్య ఉన్నారు.



జోరుగా బెల్ట్ షాపులు

రాత్రి, పగలు తేడా లేకుండా విక్రయాలు

ఘర్షణలు చోటు చేసుకుంటున్న వైనం

బడా బాబులు చెబితే ఎవరికైనా బెల్టు ఓకే?

పట్టించుకోని పోలీసులు

నందవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పల్లెలో ఎక్కడ చూసినా మద్యం బెల్టు దకాణాలు దర్శన మిస్తున్నాయి. టీకొట్లు.. దాబాలు.. ఇలా ఎక్కడికి వెళ్లినా, ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా అనధికారికంగా మద్యం విక్రయాలు సాగుతు న్నాయి. వాసన గుప్పుమం టోంది. దీని ఫలితంగా ప్రశాంత వాతావరణానికి భంగం వాటిల్లు తోంది. పేద కుటుంబాలు రోడ్డున పడుతుంటే మద్యం మత్తులో కొందరు ఘర్షణలు పడుతున్నారు. కుటుంబ సభ్యుల పైన గొడవలకు దిగుతున్నారు.


వైన్స్ షాపులా ఏర్పాటు చేసుకున్న బెల్టు షాపు నిర్వాహకులు

నందవరం మండలంలోని నందవరం, ఇబ్రహింపురం, నాగులదిన్నె, పులచింత, మాచాపురం, హాలహర్వి, బాపురం, ముగతి, కనుకవీడు, పేట, పునకలదిన్నె, గ్రామాల్లో మద్యం వ్యాపారం ఏటా లక్షల్లో జరుగుతోంది. వ్యాపా రులు పోటాపోటీగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఆదాయ వనరులు పెంచు కునే క్రమంలో ప్రతి దుకాణానికి అనుసంధానంగా చిల్లర దుకాణాలు వెలుస్తున్నాయి. అన్ని చోట్ల మద్యం బాడా నాయకుల అండ చూసుకుని షాపుల మాదిరిగా తయారు చేసుకుని అక్కడే మద్యం ప్రియులకు సిట్టింగ్ తోపాటు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. బడాబాబులు చెప్పింది చాలు ఎక్కడ పడితే అక్కడ బెల్ట్ వెలుస్తున్నాయి. అప్పట్లో సారా దుకాణాల్లో ఎలా ఉన్నాయో అదే విధంగా తయారైంది. పోలీసులు బెల్ట్‌దుకాణాలపై దాడులు నిర్వహిస్తే బడా బాబులతో ఫోన్‌లు చేయించి వారిపై ఒత్తిడి తెస్తుండడంతో వారు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో వారి అగడాలకు అంతే లేకుండాపోతోంది.

వైన్‌షాపుల నుంచి...

వైన్ షాపుల నుంచి నేరుగా గ్రామాలకు మద్యంను కొనుగోలు చేసి బైక్‌లు, ఆటోల్లో తీసుకుకెళ్లి అమ్మి సోమ్ము చేసుకుంటున్నారు గ్రామాల్లో షాపు దగ్గర కౌంటర్ ఏర్పాటు చేసుకుని రోడ్డు పక్కనే దర్జాగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కనకవీడుకు చెందిన ఆటో స్టాండ్ దగ్గర అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఈ నెల 5వ తేదీన బోయబీమన్న, ఈడిగ దేవేంద్ర దగ్గర నుంచి ఓల్డ్ అడ్మిరీయల్, ఆఫీసర్ చాయిస్ మద్యంను నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి పట్టు కుని కేసు నమోదు చేసి 14 రోజులు రిమాండ్‌కు పంపారు. ఇంతకు మునుపు అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ ముఖ్య నాయకుడు మద్యం అమ్ముతూ పోలీసులకు పట్టుబడగా కేసు నమోదు చేసి రిమాం డ్‌కు పంపారు. అయినా మారలేదు.

అధిక ధరకు విక్రయిస్తూ..

క్వాటర్‌పై రూ.10నుంచి రూ 20 వరకు అధిక రేటకు విక్రయిస్తున్నారు. రాత్రి అయిందంటే చాటు మరో రేటుకు మారుతోంది. బెల్టు షాపులో అన్ని రకాల మందులైన ఇంపీరియల్ బ్లూ, మెన్షన్ హౌస్ లాంటి మద్యం దొరుకుతుంది. అలాగే క్వాటర్‌తో పాటు వాటర్, స్నాక్ అక్కడే విక్రయిస్తుండడంతో మందు బాబులకు రెస్టారెట్లుగా మారాయి. పోలీసులు కేసు నమోదు చేస్తున్న వ్యాపారులు మాత్రం జంకడంలేదు.

● నాగలదిన్నెలో అయితే ఎకంగా ప్రజాప్రతి నిధితో దర్జాగా పేరు పెట్టి మరి అధికార పార్టీ నాయ కుడు బెల్టుషాపు నడుపుతున్నాడు. అధికార పార్టీ నాయకులైతే వెంటనే వారి పేర్లు మార్చి సామన్య పేర్లు పై ఎఫ్ఆర్ నమోదు చేస్తారనే విమర్శ ఉంది. బెల్టు అమ్ముతున్న వారి ఇళ్లపై ముకుమ్మడిగా దాడి చేస్తే బెల్టు షాపులు నిర్మూలించే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. మరోపక్క మహిళలు తమ భర్తలు రోజువారి కష్టంతో వచ్చిన డబ్బులు మద్యంకు ఖర్చు పెడుతూ ఇళ్లు గల్లు చేస్తున్నారని వాపోతు న్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



అనధికారంగా గ్రామాల్లో బెల్ట్‌దుకా ణాలు నిర్వహిస్తున్న వాటిపై దాడులు నిర్వహిస్తున్నాం. అక్రమ మద్యంను స్వాధీనం చేసుకొని అరెస్టు చేస్తున్నాం. ఇటీవల కొంత మంది రిమాండ్‌కు కూడా పంపాం. ఎవరైనా బెల్టుదుకా ణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం.

● తిమ్మారెడ్డి, నందవరం ఎస్ఐ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి


దివ్యాంగుడు నరసన్న సమస్యను వింటున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరి ష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కుర్ణికమ్యూనిటీ హాల్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణం లోని ఆయా వార్డులకు చెందిన పలువురు పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. దాదాపు 200 వినతిపత్రాలు వచ్చాయి. ఇందులో వితంతువు, వృద్ధాప్య, దివ్యాంగులు తమకు పింఛన్ రావడం లేదని, కొంతమంది టిడ్కో గృహాలు ఇవ్వాలని, ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి పత్రాలు ఇచ్చారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన పట్టణం లోని పై మాలగేరికి చెందిన మాల నరసన్న వేదిక ఎక్కేందుకు ఇబ్బంది కావడంతో ఎమ్మెల్యేనే కిందకు దిగి వచ్చి సమస్యను అడిగి తెలుసుకు న్నారు. ప్రస్తుతం తనకు రూ. 6వేలు పెన్షన్ వస్తుందని, తానుకు పూర్తి స్థాయిలో వైకల్యం ఉందని ఇందుకు దాన్ని మంజూరు చేయాలని ఎమ్మె ల్యేను కోరారు. ఇందుకు ఎమ్మెల్యే పరిశీలించి చర్యలు తీసుకుంటామ న్నారు. అలాగే వికలాంగులు హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగే సభకు ఎమ్మెల్యేను ఆ సంఘం నాయకులు ఆహ్వానించారు. అనం తరం ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ గతంలో ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలాల్లో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను పరి ష్కరించామన్నారు. ఇప్పుడు కూడా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు తిరిగి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలను ఆన్‌లైన్‌లో చేసి ఆయా శాఖలకు పంపుతామ న్నారు. వాటి పరిష్కారం నేరుగా వారి సెల్ ఫోన్లకే మెసేజ్ వస్తుంద న్నారు. నిర్ణీత సమయంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుం టామన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు మాచాని మహేష్, కౌన్సిలర్ రామదాసు గౌడ్, నాయకులు కలీముల్లా, అంజి, కామర్తి మహేష్, మహిళా నాయకురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి

గోనెగండ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి సూచించారు. గురువారం గోనెగండ్లలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. గ్రామాలలో నేరాలు తగ్గుముఖం పట్టాయా లేదా అని సీఐ విజయభాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ భార్గవి మాట్లా డుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక లోడ్‌తో ఉన్న ఆటోల్లో విద్యార్థులు ప్రయాణం చేయరాదన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే హక్కుల సాధన

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు ఉద్యమాలతోనే హక్కులను సాధించుకోవాలని ఏపీ మున్సి పల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగ భూషణం అన్నారు. స్థానిక మున్సిపల్ ఓపెన్ థియేటర్‌లో గురు వారం జరిగిన 3వ జిల్లా మహాసభకు పట్టణ మున్సిపల్ వర్కర్స్ ఎంపాయిస్ అధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు అధ్య క్షత వహించారు. నాగభూషణం, జిల్లాకార్యదర్శి అంజి బాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు 60 సంవత్సరాల పేరు తో సర్వీస్ చేయించి పెన్షన్, గ్రాట్యూటి ఇవ్వకుండా తొలగిస్తున్నారని, కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబంలో సభ్యుల్లో ఒక రికి ఉద్యోగం ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు.

నేడు ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

కౌతాళం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రము ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ వాణి తెలిపారు. గురువారం దేవస్థానపు కార్యాలయంలో ఆదివారం ఈవో మాట్లాడుతూ స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలు, నగదును లెక్కిస్తామని తెలిపారు. తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్ర మానికి ఆదోని దేవాదాయ శాఖ అధికారులు, యూనియన్ బ్యాంకు సిబ్బంది, భ్రమరాంబ సేవా సమితి ఆలయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు కోసిగి విద్యార్థులు ఎంపిక


రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన కర్నూలు జిల్లా 35వ సబ్ జూనియర్ కబడ్డీ బాలుర జట్టు

కోసిగి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలం నుంచి రాష్ట్ర స్థాయి 100 మీటర్ల పరుగు పందెం పోటీలకు కేజీబీవీ విద్యార్థిని ఈ.అ మృత ఎంపికైందని కేజీబీవీ ప్రిన్సిపాల్ షభానా అజ్మిన్, పీఈటీ సుమ తెలిపారు. జిల్లాలో ఉన్న కేజీబీవీల పాఠశాలలో కోసిగి కేజీబీవీ నుంచి ఈ.అమృత ఎంపికైందని తెలిపారు. అలాగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న చాకలి శివరామకృష్ణ జిల్లా స్థాయి ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తెలిపారు.

● రాష్ట్ర స్థాయి 35 సబ్ జూనియర్ బాలురు, బాలికలు అండర్-16 విభాగంలో కర్నూలు జిల్లా స్థాయిలో ఎంపికలో భాగంగా మంత్రాలయం మండలం విద్యానగర్‌లో జిల్లా బాలురు, బాలికల ఎంపిక పోటీలు నిర్వ హించినట్లు కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేసన్ అధ్యక్షులు చావిడి వెంకటేశ్, కార్యదర్శి వలకలదిన్నె వెంకటేష్ తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు అండర్-16 విభాగంలో బాలురు, బాలికల జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో పీడీలు లక్ష్మీకాంత్, గోపాల్ రెడ్డి, కవిరాజు, వడ్డెలక్ష్మి, అంజనేయులు, మల్లి, వేణు ఉన్నారు.

చౌడేశ్వరీదేవికి పూజలు


పూజలందుకుంటున్న అమ్మవారు

పెద్దకడబూరు,నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరులోని చౌడేశ్వరి దేవి ఆలయంలో కార్తీక మాసం పూజలు ఘనంగా నిర్వహించారు. గురు వారం అమ్మ వారికి ఉదయం నుంచి పుష్పాభిషేకం, కుంకుమార్చన, జలాభి షేకం, మహగణారాధన, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మహిళలు ఆలయం ముందు కార్తీక దీపాలను వెలగించి మొక్కులు తీర్చుకున్నారు

గుర్రపు డెక్క తొలగింపు


గుడికల్ చెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలం లోని గుడికల్ చెరువులో పెరుకుపోయిన గుర్రపు డెక్కను ఎల్లెల్సీ అధికారులు తొలగించారు. ఈ చెరువులో గత కొంత కాలంగా గుర్రపు డెక్క ఏపుగా పెరిగి నీటి ప్రవాహానికి తీవ్ర ఇబ్బందిగా మారింది. అంతేగాక చెరువులోకి నీరు తాగేందుకు చిన్నపాటి మూగజీవాలు వెళ్తే బయటకు రాలేక ప్రమాదాలకు గురయ్యేవి. ఈ చెరువు నుంచే ఎమ్మిగనూరు పట్టణానికి తాగు నీరు సరఫరా అవుతుంది. అంతేగాక ఎమ్మిగనూరు, గోనెగండ్ల మండలాల రైతులకు సాగునీటితో పాటు గాజులదిన్నె ప్రాజెక్టుకు ఈ చెరువు నుంచే నీరు సరఫరా అవుతుంది. గుర్రపు డెక్క చెరు వులో పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఎల్లెల్సీ ఈఈ పాండురంగయ్య, డీఈఈ విద్యా సాగర్, ఏఈలు మణికంత, నాగేష్‌లు గుర్రపు డెక్క తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. చెరువులో రెండు ఎక్సకవేటర్లను పెట్టి ప్రతి రోజూ కాలువ లస్కర్లు కృష్ణయ్యనాయుడు, షేషావలిలతో పాటు మరి కొంతమంది సిబ్బందితో గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్‌పెక్టర్లు అర్జున్, నాగేష్, సుధాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం


చెక్కులను పంపిణీ చేస్తున్న మంచాల సింగిల్‌విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

మంత్రాలయం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం బాగాలే కపోయి సొంత డబ్బులతో చికిత్సలు చేయించుకున్న బాధిత కుటుంబా లకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని మంచాల సింగిల్‌విండో అధ్యక్షులు రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మాధ వరం తన నివాసంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆదేశాలు మేరకు సీఎం సహాయ నిధికింద పెద్దకడబూరు మండలం లోని జాలవాడి గ్రామానికి చెందిన వైష్ణవికి చికిత్స నిమిత్తం మంజూ రైన రూ.2.50లక్షల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచు రఘునాథరెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, వెంకన్న, భీమన్న, శాంతప్ప, రంగన్న, భీమ, దేవ దానం, గూర్మింటి భీమిరెడ్డి,నాగరాజు,రామయ్య, రామకృష్ణ, భూదిరెడ్డి, జయరామ్‌తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలను కాపాడుకుందాం


చెట్నహళ్లిలో కోటి సంతకాలు సేకరిస్తున్న గుర్రెడ్డి భీమిరెడ్డి, నాయకులు

మంత్రాలయం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడం అందరి బాధ్యతగా గుర్తించుకోవాలని వైసీపీ మండల అధ్యక్షులు గుర్రెడ్డిభీమి రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో మెడి కల్ కళాశాలల విధానాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణను సర్పంచు బెస్తఅంజనేయులు, ఎంపీటీసీ రామాంజనేయులు, వైస్ సర్పంచు వీరనాగప్ప, మాజీ సర్పంచు అల్లింగప్ప ఆధ్వర్యంలో నిర్వహిం చారు. సమావేశంలో వైసీపీ నాయకులు నాగేంద్ర, వెంకటేష్, లక్ష్మన్న, మల్లికార్జున, తిక్కస్వామి, బ్రహ్మయ్య, రఘు, ఉసేనప్ప, చంద్ర, ఉరు కుందు, బారికి ఈరన్న, పరుశప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టండి


మాట్లాడుతున్న నాయకులు

మంత్రాలయం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కుంటున్న తాగునీరు, సాగునీరు, సీసీరోడ్లు, మురికికాలువలు వంటి అభివృద్ధి చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నారాయణ అన్నారు. గురువారం మండల కార్యదర్శి జయరాజు, పెద్దకడబూరు మండల కార్యదర్శి తిక్కన్న ఆధ్వర్యంలో ఆటో జాతా నిర్వహించారు. మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో వారు మాట్లాడుతూ ఈనెల 10న సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు మహా ధర్నాను విజవంతం చేయా లని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మన్న, ప్రాణేష్, అంజి, రాజు, శీను, దేవదాసు, ఆశిర్వాదం, బసన్న, అహ్మద్ పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

మంత్రాలయం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రా లయం, మాధవరం ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్ హెచ్చరించా రు.గురువారం రాత్రి వగరూరు గ్రామంలో ఎస్ఐ శివాంజల్ ప్రజలతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మాధవరం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడారు. అయా గ్రామాల్లో మట్కా,పేకాట, అసాంఘిక కార్యకలపాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

అధిక లోడుతో వెళ్లితే కేసులు నమోదు చేస్తాం


పెద్దకడబూరులో ఆటో డ్రైవర్‌కు సూచనలు ఇస్తున్న ఎస్ఐ

పెద్దకడబూరు,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వహనాలు అధిక లోడుతో వెళ్తే వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ నిరంజన్ రెడ్డి అన్నారు. గురు వారం పెద్దకడబూరు లోని అధిక వహనాల తనిఖీ చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆటోల్లో ప్రయాణికులను అధి కంగా ఎక్కించడం వల్లన ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. పరిమి తికి సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు.